# మీరజాల గలదా!

- పాలెపు బుచ్చిరాజు

న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి?

ఎవరన్నారది? ఎవరు? ఎంత ధైర్యం!

సాహితీ ప్రాంగణంలో, ధైర్యము, దర్పము, ఠీవి, ఆభిజాత్యము, ప్రౌఢత్వము అనన్య సామాన్యంగా ప్రదర్శించి రాజ్యమేలిన మహారాజ్ఞి సాత్రాజితి పాత్ర నిత్య సత్యమై వెలుగొందుతుండగానే!?

ఆమె సౌందర్యవతి, మానవతి, మహనీయ సౌభాగ్యవతి.

ఆమె నెరుగరా ఆ మాటలన్నవారు? వారికి పారిజాతాపహరణం పరిచయం లేదూ!

చెలికత్తెల ద్వారా రుక్మిణి కొప్పులోని పారిజాతపు గొప్పదనాలు విని సపత్నీ మాత్సర్యంతో కృంగిపోయింది సత్య. ఇంకా ఆ వెన్నల దొంగ నన్నెవతెగా తలచినాడో అని వాపోయింది.

పేరలుకతో ఆ భూషణాలన్నీ తొలగించి, మాసిన చీరగట్టి నిడువాలిక కస్తూరి బొట్టు పెట్టి అలకా గృహంలో శయ్య మీద అటు తిరిగి పడుకుంది. భర్త రానే వచ్చాడు. "అలిగితివా సఖీ! ప్రియా! అలుక మానవా!" అని బ్రతిమిలాడబోయాడు. అంతే! బ్రహ్మాండం బ్రద్దలయింది. అది వామపాదం అని కూడా గుర్తించలేదామె! అది ఉచితమేనా అని ఆలోచించలేదు. ఆ పాదం వెళ్లి ఆ లతాంతాయుధుడి తండ్రి శిరస్సును తాకింది.

ఇంత జరిగినా ఆ జగన్నాటక సూత్రధారి చలించలేదు. పైగా, "నా కఠినమైన శిరస్సును తాకి నీ సున్నితమైన పాదం కందిపోయిందేమో! చూడనీ!" అని మృదువైన చేతుల్తో ఆమె పాదాలొత్తాడు. ప్రియుని శరీరం నుంచి వచ్చే పారిజాత కుసుమ వాసనలు సత్యాగ్రహాన్ని మరింత రెచ్చగొట్టాయి. పగబట్టిన నాగుబాములా బుసలు కొట్టిందా భామ. "ఛా! పోయి నీ ప్రియురాలినే ఏలుకో!" అని ఛీత్కారం చేసింది. "నన్నెవతెగా చూశావ"ని ఎదురు ప్రశ్న వేసింది.

"ఒక్క పూవు కొరకే నీకింత అలుక ఏలనే! ఆ వృక్షాన్నే పెకలించి తెచ్చి నీ పెరటి చెట్టుగా పాతి పూలు పూయిస్తాను" అని మాట ఇచ్చాక కాని ఆమె కోపం దిగజారలేదు. అదీ కార్యసాధన అంటే!

నందనవనంలో దగ్గరుండి శ్రీకృష్ణుని చేత పారిజాత వృక్షాన్ని వొయించింది. వనపాలకులడ్డగిస్తే, "ఇంద్రుడెవరు? ఇంద్రాణి ఎవరు? హరి సొమ్మిది. హరి వద్దకే చేరింది. మీ శచీదేవి వీరపత్ని అయితే విభుణ్ణి పంపి, సత్యభామా విధేయుడి నోడించి తీసికెళ్లమని చెప్పండి" అని వారిని ధిక్కరించింది.

అంతెందుకూ! శ్రీకృష్ణ తులాభారంలోనే తేలిపోలేదూ? ఎవరి బలాబలాలెంతటివో. రుక్మిణి వచ్చి, దేవర్షిని తులసిదళంతో మాయ చేసినట్టు గాదు. ఎన్ని నగలు! ఎన్ని ధన కనక వస్తు వాహనాలు! ఎన్ని సంపదలు, ఎంత సౌభాగ్యం, ఎన్ని సిరులు, ఆఖరికి నిలువుదోపిడీ సహితం సమర్పించింది తాను, తన పతిని సరితూచడానికి. ఆ సర్వసంగ పరిత్యాగి, ఆ బ్రహ్మచారి నారదునికి అనుభవించే యోగం లేక కాని, అంగీకరించి వుంటే రుక్మిణికీ తెలిసివచ్చేది, కృష్ణసత్యల అవినాభావ సంబంధం. పతిని పరాయివాడికి దానం ఇచ్చేందుకు వెనుకాడకుండా, పుణ్యక వ్రతమాచరించడమే అమోఘమూ, అద్భుతమూను. ఆ సాహసం సత్యభామకే కాక మరెవరికీ సాధ్యం కాదు.

అంతటి ధైర్యసాహసాలున్న భార్య కాబట్టే భర్త నరకాసురునితో యుద్ధానికి వెళ్తూంటే తానూ వెంట వస్తానని తయారైంది. "ప్రాణేశా నను నీతో తోడ్కొనిపో! నీ బల ప్రతాపములు, నీ యుద్ధ చాతుర్యము కన్నులారా చూసి ఆనందించడమే కాక, తిరిగి వచ్చి నా సవతులందరికీ అక్కడి విశేషాలు కథలుగా చెప్పి సంతోషిస్తాను" అని వేడుకుంది. అప్పుడు శ్రీకృష్ణుడు నవ్వుతూ ఇలా అన్నాడు–

"ఓ యువతీ లలామా! యుద్ధరంగంలో పువ్వుల మధ్య తిరుగాడే తుమ్మెదల ఝూంకారాలు కాదమ్మా వినిపించేవి. కర్ణకఠోరములైన ఏనుగుల ఘీంకారాలవి. గాలిలో తేలివచ్చే పరాగ రేణువులనుకుంటున్నావేమో అని అశ్వముఖముల నుండి వెలువడిన రజములు సుమా! శత్రువులు విడిచిన శరపరంపరలని జలతరంగాలని భ్రమించి తానమాడేవేమో! చతురంగ బల సమోపేతములైన సైన్య సమూహాల సాధన ప్రహారములవి. కొలనులో మొలిచిన కలువలు, తామరతూండ్లు కావు. ఓ కోమలాంగీ! నువ్వెక్కడ? రణరంగమెక్కడ? అటువంటి ఆలోచనలు మాని నీవిక్కడే వేచి ఉండు. నేను ఇప్పుడే పోయి త్రుటిలో వారిని గెలిచి వస్తాను."

అప్పుడా మానిని కించిత్తు కూడా భయపడకుండా, "స్వామీ! వాళ్లు దైత్యులు కానీ, దైత్య సమూహములు కానీ! నీ ప్రక్కనున్న నాకు వేరే రక్షణ ఏల? అంతేకాక, ఆ దుష్ట రాక్షసుడు పదారువేల కన్యల్ని బందికానాలో పట్టి బంధించినాడని విన్నాను. వారందరినీ విడిపించడంలో నీకు చేదోడుగా ఉండాలని ఉవ్విళ్లూరుతున్నాను. ఇంకా విను– నన్ను నేను రక్షించుకోగల్గినంత విలువిద్య నేనూ నేర్చే ఉన్నాను. నన్ను వారించే ప్రయత్నం మాని ఇద్దరం కలిసి వెళ్లే ఏర్పాట్లు చేయి" అని స్థిరంగా చెప్పింది.

ఇక తప్పదని తెలుసుకున్న వేణుగానలోలుడు యేణీలోచనను వెంటబెట్టుకుని, గరుడ వాహనాన్నెక్కి సైన్యాలు వెంటరాగా, ఆకాశమార్గాన ప్రాగ్జ్యోతిషపుర ప్రాంతానికి చేరుకున్నాడు.

ఆ ప్రాగ్జ్యోతిషపురమే నరకుని నగరం. దానిని మురాసురుడనే రాక్షసుడు మాయాపాశములతో బంధించి శత్రునిర్భేద్యంగా నిత్యమూ కాపాడుతూ ఉంటాడు. ముందుగా కృష్ణుడు ఆ పాశ బంధనాల్ని ఛేదించాడు. ప్రాకారం దగ్గర చేరి, రాక్షసుల గుండెలు దద్దరిల్లేలా పాంచజన్యం పూరించాడు. ప్రళయకాల మేఘగర్జన లాంటి ఆ శబ్దం విని మురాసురుడు గాఢ నిద్రలోంచి మూల్గుతూ లేచాడు. వాడు పంచశిరుడు. లేస్తూనే, లోకాలన్నిటినీ కబళించి వేస్తాడన్నట్టుగా కృష్ణుని సైన్యంపై విరుచుకుపడ్డాడు. గదాయుద్ధంలో వాడినోడించి, ఆ అయిదు శిరములు తన చక్రాయుధంతో ఖండించాడు కృష్ణుడు. అప్పుడా అసురుడు ఇంద్రాయుధ ప్రఘాతానికి కూలిపడిన పర్వత శిఖరంలా నీటమునిగి మరణించాడు.

అది తెలిసి మురాసురుడి కొడుకులు ఏడుగురు చక్రిపై దండెత్తుకు వచ్చారు. వారందరినీ ఖండఖండాలుగా త్రుంచివైచాడు కృష్ణుడు.

అప్పటికిగాని నరకాసురునికి శౌరి శౌర్యం అవగాహన కాలేదు. ఆ రోషంతో, గరుడ గమనుని గర్వమణచివేస్తానని శపథం చేసి, తాను సర్వాభరణ భూషితుడై, చతురంగ బలసమేతుడై రణరంగంలో అడుగుపెట్టాడు. అక్కడి సన్నివేశం చూసిన నరకుని కళ్లు జిగేలుమన్నాయి. రణభూమిలో తానాశించిన వీర, రౌద్ర, బీభత్సాది రసాలకు బదులు, పూర్ణేందు బింబం ప్రక్కన, మెరుపుల మధ్య ప్రకాశించే నీలిమేఘంలా, సత్యభామ ప్రక్కన కృష్ణుడు సుఖాసీనుడై సంగర కథాలాపములతో కాలక్షేపం చేసే శృంగారరసం సాక్షాత్కరించింది. నరకుని క్రోధాగ్నికి ఆజ్యం తోడైంది. శలభంలా ఉవ్వెత్తున ఎగిరి సమరాంగణ ప్రవేశం చేశాడు.

అప్పుడు ముందుగా జాగ్రత్తపడింది కృష్ణుడు కాదు– అంతవరకు రణరంగపు వర్ణనలు ప్రియుని ద్వారా వింటున్న సత్యభామ! తన ధైర్య సాహసాలు ప్రదర్శించదగిన సమయం ఆసన్నమైందని గ్రహించింది. అంతే! కూర్చున్న దగ్గర్నుంచి లేచి నుంచుంది. జుట్టు ముడిపెట్టింది. చక్కగా నీవి బంధించింది. సర్వాభరణ భూషితురాలైంది. చేతితో పమిట చెంగు పట్టి ముందుకు లాగి మొలలో దోపింది. యుద్ధానికి సంసిద్ధురాలైంది.

ఆ సంరంభాన్ని తిలకించి యదురాజన్య శ్రేష్ఠుడు ముచ్చటపడ్డాడు. దనుజుల దౌర్జన్యాన్ని మట్టుపెట్టడానికి నడుంకట్టిన నారీ శిరోమణిని చూసి సరసోక్తులాడాడు.

"లేమా! దనుజుల గెలువగలేమా! నీకేలనే ఈ శ్రమ. లే! మానుకో ఈ ప్రయత్నం. లేదంటావా. ఇదుగో ఈ విల్లందుకో!" అని విల్లందించాడు.

ఆ విల్లందుకొన్న వెలది శరీరంలో నూతనోత్సాహం తొణికిసలాడింది. క్షణంలో వింటి త్రాటిని సంధించింది. ఆ సంధానంతో రాక్షస స్త్రీల మెడల్లోని త్రాళ్లు తెంపే ఉత్కంఠ ప్రచ్ఛన్నంగా ఉంది. నారి సారించడమే తడవు, అమ్ములపొది నుండి ఎప్పుడు తీస్తోందో, ఎప్పుడు గురిచూసి బాణాలు వదుల్తోందో అంతు తెలియకుండా శరపరంపర శత్రువులపై కుంభవృష్టిగా కురిపించసాగింది.

ఆ వింటినారి శబ్దాలు ఆమె ముంజేతి కంకణ నిక్వాణంలో కలిసిపోయాయి. శత్రుసైన్యాల హాహాకారాలు ఆమె శరపాత ఘుమఘుమ శబ్దంలో కరిగిపోయాయి. ఆ సమయంలో సత్యభామ– వీర, శృంగార, భయ, రౌద్ర, విస్మయములు కలిసి భామిని అయిందా అన్నట్టున్నది.

ఒక ప్రక్క వైరిని, మరొక ప్రక్క భర్తను గమనిస్తూ, రోషమూ, అనురాగమూ ఒకేసారి ఒలకబోస్తూ, ముడిచిన భ్రుకుటి, మందహాసములతో, వీరమూ, శృంగారమూ ప్రదర్శిస్తూ, కన్నుల్లో కెంపులూ, సొంపులూ ఒకేసారి ప్రదర్శిస్తూ, ఒక ప్రక్క అస్త్రాన్ని వైరిపై సంధిస్తూనే, ఇటు భర్తపై సరసాలోకములు నెరపుతూ, సత్యభామ

రణరంగంలో భాసిల్లింది.

ఆ వయ్యారి భామ ప్రత్యాలీఢపాదంతో నుదుటిపై మెరిసే స్వేదబిందువుల నంటిన ఉంగరాల ముంగురులతో, ఆ కర్ణికాంతం లాగి గురిపెట్టిన జ్యాతో, శత్రువుపై సునిశితమైన లక్ష్యంతో, వలయాకారంగా విలసిల్లే ధనుర్బాణములతో విలువిద్యను ప్రదర్శించి అస్త్ర ప్రయోగంలో తనకు తానే సాటి అనిపించుకుంది.

ఒకనాడు బొమ్మ పెండ్లిండ్లకు వెళ్ల నిరాకరించిన బాల భీకర రణరంగంలో వైరి వర్గాల మధ్య ఎలా నిలిచిందో! పరపురుషులెదురైన మరుగు జేరు ముదితకు పగవారి నెదిరించు సాహసమెక్కడిదో! బంగరు తూగుటుయ్యాల లెక్క భయముందే భీరువు ఖగపతిపై నెక్కి ఎలా స్వారి చేసిందో, చెలుల కల కల స్వనాలే కర్ణకఠోరములుగా భావించే భూమిని, పటాహాది వాయిద్యాల మ్రోతలెలా భరించిందో, నెమళ్లకు నృత్యాలు నేర్పుతూ అలసిపోయే పొలతి శత్రుసంహారం ఎలా చేసిందో చూపరుల కిదంతా చిత్రంగా గోచరించింది.

వీణియ నరిబట్టు విధానమెరుగని యువతి బాణాసనాన్ని నేర్పుగా సంధించింది. అందమైన తీగెను పందిరి ఎక్కించజాలని జాణ విల్లుకి నారినెక్కించింది. ముత్యాల హారాలు గ్రుచ్చలేని నెచ్చెలి శరపరంపర లేసింది. చిలుకకు పద్యం చెప్పనేర్వని చిన్నది అస్త్రమంత్రాదు లభ్యసించింది. అంతఃపురంలో పలుకే బంగారమయ్యే అబల రణరంగంలో సింహగర్జనలు చేసింది. అదీ సత్యభామ సామర్థ్యం.

అందుకే దావాగ్నిలా వ్యాపించే దానవుల అకృత్యాల్ని అరికట్టేందుకు, తన ధనుష్టంకారాన్ని మేఘగర్జనగానూ, విల్లును ఇంద్రధనుస్సుగానూ, నీలి మేఘశ్యాముడు మేఘంగానూ, తను విద్యుల్లతగానూ మారి, వర్షాకాలాన్ని సృష్టించినట్టుగా, శరపరంపరల్ని కురిపించింది సత్యభామ.

అప్పుడా వీర నారీమణి నెమ్మొగము నరకాసురునికి రవిబింబప్రాయము కాగా, నందనందనునికి చంద్రబింబంలా గోచరించింది. ఆమె చేలాంచలము వైరికి ధూమకేతువై, హరికి మదనకేతనమైంది. వలయాకారమైన ఆమె చేతి చాపము సూర్యునిపై గుడిలా వైరికి, మదనచాపములా శౌరికి అగుపించింది. ఆమె సందర్శనమే నరకునికి అగ్నిగుండము కాగా, వెన్నునికి అమృత ప్రవాహమైంది. ఆ బాణవృష్టి నరకునికి రోషదాయి కాగా, శ్రీకృష్ణునికి హర్షదాయి అయింది. ఆ ప్రాంతమంతా వీరరసంలో రణరంగం కాగా, శృంగార రసంలో గృహ ప్రాంగణమైంది.

ఇలా వీరవిహారం చేసే సత్య శరపరంపరల ధాటి నెదుర్కొనలేక నరకుని సేనలు వెనుదిరిగి పోజొచ్చాయి. అప్పుడు కృష్ణుడామెను సంబోధిస్తూ, "భామామణీ! యుద్ధరంగంలో నీ నైపుణ్యాన్ని కన్నారా గాంచి ముగ్ధుడనయ్యాను. నీకేం కావాలసినా కోరుకో, తీరుస్తాను. కాని ఇక యుద్ధం చాలించు" అన్నాడు. ఆమె చేతి నుండి ధనుర్బాణాలను గ్రహిస్తున్న కృష్ణుడితో నరకుడు ఇలా అన్నాడు:

"కృష్ణా! మగువలు ముందు మగతనము చూపించగా మౌనమూనుట మగవారికి తగదు. మావంటి దనుజ వీరులు మగువల జోలికి పోరు సుమా! మగవాడివైతే మాకెదురు నిలిచి పోరాడు!"

అది విన్న వెన్నుడు అరివీర భయంకరుడై నరకుని సేనలను ఛిన్నాభిన్నం చేసి, చక్ర ప్రయోగంతో ఒక్క వ్రేటుతో నరకుని శిరాన్ని ఖండించి భూభారాన్ని తగ్గించాడు.

ఈ విధంగా భర్తకు రణరంగంలో తోడుగా నిలిచి శత్రుసంహారంలో పాలుపంచుకున్న సత్యభామ మహిళా లోకానికే అకుంఠితమైన కీర్తిని తెచ్చిపెట్టింది.

పురుషాహంకారానికి స్వస్తి చెప్పి స్త్రీ శక్తిని చాటిచెప్పిన వీరవనిత సత్యభామ. ఆ విజయాన్ని పురస్కరించుకుని–


"స్త్రీ స్వాతంత్ర్యమర్హతి"

అని మరోసారి మననం చేసుకుందుకే మనం దీపాల పండుగ దీపావళి జరుపుకుంటున్నాం ప్రతియేటా!

(పారిజాతాపహరణం- భాగవతం- ఆధారంగా)

●

## ఔరా! ఈ భూమి పుట్టుక



**భూ**మి ఒక ఆకాశం
ఎన్నో గ్రహాల ఆగ్రహాల్ని మోస్తుంది
లక్షల నక్షత్రాల లక్ష్యాల్ని నెరవేరుస్తుంది

భూమి ఒక మ్యూజియం
గత సామ్రాట్టుల సామ్రాజ్యాల్ని కనబరుస్తుంది
గడచిన వైభవ వైభోగాల్ని తెలుపుతుంది

భూమి ఒక గది
నలుదిక్కుల చిత్రాల విచిత్రాల్ని చూపెడుతుంది
కింది పునాదిని మీది కప్పును వర్ణిస్తుంది

భూమంతా ఒక తెల్లని కాగితం
మొదట్నుంచి ఇప్పటిదాకా దీనిమీద
ఎన్నో జీవితాల చరిత్ర రాసి మలిపి రాస్తున్నారు
ముప్పయ్ మూడేళ్ల కింది పోరాటమయినా
మూడు ముక్కల్లో ముగిసిపోదు

ఎంతమంది వీరుల త్యాగాలు
ఎంతమంది నియంతల ఘోరకృత్యాలు
ఎంతో పెద్ద చరిత్రనైనా రాయడానికి
భూమి ఎంత విశాలంగా పరుచుకుంది

నీటి మీదా నిప్పు మీదా
గాలి మీదా గగనం మీదా
రాసే ఓపికా కలానికి
చూసే ఓపికా కళ్లకు ఉండాలి గాని
బంగారు అక్షరాలతో బహు సుందరంగా రాయొచ్చు

అక్షరం పుట్టకపోతే చరిత్ర
అప్పటికప్పుడు అంతమయ్యేది
ముప్పయ్ మూడేళ్ల కింద
మూడు ముక్కల్లో మొదలైన మాట
మూడు వేల కుర్చీలతో విస్తరించి ఒక మహా ప్రసంగమైంది
మూడు ప్రవాహాలు కలిసినచోట ఒక సముద్ర సంగమమైంది

చిగురు నుంచి ఆకు
ఆకు నుంచి రెమ్మా- ఇలా-
శాఖోపశాఖలూ- లోయలూ- శిఖరాలూ-

ఎంత వింతయైన
విడ్డూరమైన భూమి ఇది
దీనిమీద త్యాగధనుల మరణాలే కాదు
నియంతల బతుకులూ కనబడతాయి
నీతిహీనుల గాధలూ వినబడతాయి

భూమి
ఒక జనన పేటిక
ఒక స్మశాన వాటిక
అంతేకాదు
చతురంగ బలాల సామ్రాజ్యవాద దళాల
అనంత పోరాటాల ప్రపంచ క్షేత్రం

– కందుకూరి శ్రీరాములు